# పంపకం

"ఇది వరకు పంచాయతీ అంటే ఇలాగుండేదా, కాకిసేత కబురంపిత్తే ఒచ్చి వాలిపోయీవోరు జెనం"- అసహనంగా కుర్చీలో అటూ ఇటూ కదిలి ఆర్పేసిన చుట్టని మళ్లీ వెలిగించాడు సర్పంచి.

"ఎనిమిది గంటలకి పంచాయతీ మొదలవ్వద్దని సెప్తే తొమ్మిది కావత్తాంది, అసలైనోళ్లే అయిపులేకుండా పోతే ఎలాగయ్యా, ఎబ్బెబ్బే.."

"మావయ్యా, అందరికీ టీలు పంపించమంటావేమో అడగమంటదమ్మ" జారిపోతున్న నిక్కర్ని ఓ చేత్తో పైకి లాక్కుంటూ ఎదురింటి గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు ఎనిమిదేళ్ల కుర్రాడొకడు. ఇప్పుడు జరుగుతున్న చర్చంతా ఆ ఇంటిని గురించే.

"ఈడెవడీ బుడ్డోడు?"

"మా అక్క కొడుకండి, ఆఖరోడు" అన్నాడు రామ్మూర్తి.

"మన సుబ్బులు కొడుకే? ఎంత మంది పిల్లలూ?"

"నలుగురండి, ఇద్దరాడ, ఇద్దరు మొగ"

"నీ బావ పోయేట్ట కాదూ ఆ మధ్య, ఈళ్లందర్నీ ఇక్కడికి తీసుకొచ్చేసేరా?"

"లేదండి, మాయమ్మ పోయిందనొచ్చేరు. ఏదో ఆళ్లున్న ఊళ్లోనే ఆ పిల్లల్నేసుకుని అలాగ పాట్లుపడతందండి"

"వస్తన్నాడొస్తన్నాడు" అన్నారెవరో. వీధి చివర మలుపు తిరిగి వస్తున్న శంకర్రావుని చూసారందరూ. స్తంభానికి చేరబడి తలదించుక్కూర్చున్న రామ్మూర్తి కళ్లు పైకెత్తి తమ్ముణ్ని దీర్ఘంగా చూసాడు. కాఫీ రంగు పేంటులో తెల్లచొక్కా ఇన్‌షర్ట్ చేసుకుని నిగనిగలాడే బూట్లు వేసుకుని పేంటు జేబుల్లో చేతులుంచుకుని స్థిమితంగా నడిచి వస్తున్నాడు శంకర్రావు.

"ములిగిపోయేవోడికీ, ఒడ్డునున్నోడికీ తేడా అదే" అన్నాడు కనుబొమల్తో

రామ్మూర్తినీ, శంకర్రావునీ పక్కనున్న వాడికి సైగచేసి చూపిస్తూ పరశురామం గారు. ఆయన స్కూలు టీచరు. ఇరవై ఏళ్లుగా అదే వూళ్లో పని చేసి రిటైరయ్యాక అక్కడే స్థిరపడ్డాడు. పంచాయతీ మెంబరుగా ఆయన్నీ పిలుస్తుంటారు. చిన్నదో పెద్దదో ఉద్యోగమంటూ ఉంది కాబట్టి శంకర్రావు ఒడ్డున ఉన్నవాడు ఆయన దృష్టిలో

"నిన్నొచ్చిన పదిమంది కూడా రాలేదే ఇయ్యాళ" అన్నాడు సర్పంచి గారు.

"ఈ రోజుల్లో ఎవరికండీ ఇలాంటి యవ్వారాలమీద ఆసక్తి? టీవీలొదిలి వొస్తన్నారా జెనాలు!" పెద్దాయన మునసబుగారు నిరసనగా కాండ్రించి ఉమ్మేసేడు.

"అసలైనోళ్లిద్దరూ ఒచ్చేసినట్టేగదా, కానిచ్చేద్దాం పట్టండి"

శంకర్రావు నేరుగా పంచాయతీ ఆఫీసు వరండాలోకొచ్చి నిన్నట్లాగా బల్లమీద కూర్చోబోయి, అన్నగారు కింద కూర్చున్నాడని గమనించి ఆగాడు. రెండడుగులు వెనక్కి నడిచి మరో స్తంభానికి చేరబడి నిల్చున్నాడు. జేబుల్లోంచి చేతులు మాత్రం తియ్యలేదు.

"ఆ పంట్లాం జేబుల్లో పిస్తోళ్లేమైనా ఎట్టుకొచ్చేవేంట్రా శంకరం, ఆ సేతులు తియ్యొసె" అన్నాడు బావ వరసైన రాజులయ్య.

శంకర్రావు వెంటనే చేతుల్ని బైటికి తీసేసి ఒక్క నిముషం ఏం తోచనట్టు గోళ్లు గిల్లుకుని, ఈసారి చేతులు కట్టుకుని నిల్చున్నాడు.

అంతసేపూ తన్నే గమనిస్తున్న సర్పంచి గోడకిరాసి చుట్టని ఆర్పేసి రెండువేళ్లతో దాని అంచుల్ని సరిచేస్తూ "ఏరా శంకరయ్యా, అదేవన్నా మీ బస్తీ అనుకున్నావేంట్రా, పంచాయితీ ఎనిమిది గంటలకంటే స్తిమితంగా ఎనిమిదిన్నర దాటేకొచ్చేవు" అన్నాడు.

"రోడ్డు చివర హోటలుకెళ్లి కాఫీ తాగి వచ్చేసరికి కొంచెం ఆలీసెమైంది"

అన్నాడు అతి కేజువల్‌గా శంకర్రావు.

"ఆడికీవూళ్లో అన్నా వదినా అప్పుడే చచ్చేరనుకుంటన్నాడు చూడండి. హోటలుకెళ్లి కాఫీ తాగి వస్తున్నాడంట" రామ్మూర్తి మొహం ఉక్రోషంతో కంద

గడ్డలాగైపోయింది. కళ్లల్లో నీళ్లొక్కటే తక్కువన్నట్టుంది.

"పోన్లే పోన్లే, ఆడిజేబులో డబ్బులలాగేడిపిస్తన్నె. కాఫీకి రోడ్డు చివరికి, భోజనానికి బస్తీకి ఒటేలుకెళ్లొస్తాడు, అదాడిష్టం. అసలు విషయానికొద్దారి. నువ్విలాగొచ్చి బల్లమీద కూచో రామ్మూర్తీ, ఆడలాగెంత సేపునుంచునుంటాడు" అన్నాడు సర్పంచిగారు.

రామ్మూర్తి లేచొచ్చి బల్లమీద చతికిలబడ్డాడు. ఎదుటిబల్లమీద శంకర్రావు కూర్చున్నాడు. అతను అన్నగారి వైపు చూడనైనా చూడడంలేదు.

"ఏవంటావురా శంకరం?" అన్నాడు సూటిగా విషయానికొస్తూ మునసబుగారు.

"ఏవంటాను, నేననేదేదో నిన్ననే చెప్పేను. పదే పదే ఇదే ప్రశ్నవేసి టైం వేస్టు చేస్తున్నారెందుకో నాకర్థం కావడం లేదు.

"అది కాదురా, రామ్మూర్తి ఆడపిల్లలు గలోడు. నీకా ఇద్దరూ మొగపిల్లలే. నువ్వు కాస్త ఆలోచించి అడగమని కదా నిన్నట్నుంచి పోరతన్నాం"

"మరలాంటప్పుడు ఈ వాటాలిలాగెందుకేసేరు? చిన్నోడిని ముందుగా నన్నే ఎంచుకోమని ఎందుకన్నారు, ఆయన్నే ముందుగా కోరుకోమనకపోయేరా! మళ్లీ ఇపుడీ మతలబులేంటి?" నిష్ఠూరంగా అన్నాడు శంకర్రావు.

"నీకిద్దరు మొగపిల్లలున్నారని పదే పదే రొక్కిస్తన్నారెందుకు, ఈ కాలంలో మొగపిల్లలకే ఖర్చు ఎక్కువౌతూంది తెల్సా! ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేసి అత్తోరిళ్లకి పంపించేస్తే గొడవొదిలిపోతుంది. మొగవెధవలకలాగ కాదే, చిన్నప్పట్నుంచి కాన్వెంటు చదువులూ, షోకులూ, ఆపైన ఉద్యోగం వచ్చేదాకా ఆళ్ల పెంపకాలూ... ఎంత ఖర్చో తెల్సా"

"ఓసోస్, నాకు తెలవకడుగుతాను, మరి మీ అన్నయ్య నిన్నలాగ పెంచలేదేంట్రా?" అన్నాడు రాజులయ్య.

"ఆరోజులు వేరు..." నీళ్లు నమిలాడు శంకర్రావు.

"మనుషుల్లో ప్రేమలూ ఆప్యాయతలూ ఉండాలి గానీ ఏ రోజులూ వేరు కావురా శంకరం. కూలీ నాలీ చేస్తానే ఆ ఎకరం కొండ్రా, ఆ రెండు గదుల ఇల్లూ సంపాదించడానికి మీ అయ్య ఎన్ని పాట్లు పడ్డాడో మీకు తెలవదు. నాకు తెలుసు. మీ చిన్న తనంలోనే మీ అయ్య పోతే మీ అన్న రామ్మూర్తి రెక్కల కష్టం చేసి, తినీ తినకా ఆటిని నిలబెట్టేడు. మొదట్నుంచీ బస్తీల్లో ఆస్టళ్లలో చదువుకున్నోడివి, చదువవుతూనే నాలుగు రాళ్లు సంపాదించే ఉద్యోగంలో చేరినోడివీ కాబట్టి నీకీ పల్లెటూళ్లో బతుకులెంత గడ్డుమారిపోయాయో తెలవదు. పెద్దోణ్ణి నేనెందుకు చెప్తున్నానో విను"- శంకరం నిన్నటంత పెడసరంగా లేడని చూస్తూనే పసిగట్టాడు ముసలాయన. అందుకే నచ్చచెప్పడానికి పూనుకున్నాడు. ఉన్నట్టుండి శంకర్రావుకెందుకో చివ్వున కోపం వచ్చింది.

"ఈ రాజకీయాలేం నాకు తెలీవని అనుకోకండి. మీరూ మీరూ ఒక ఊళ్లో ఉంటున్నారు. అందుకే అందరూ కలిసి ఒకే మాట మీద నిలబడి ఆయన తరఫున మాట్లాడుతున్నారు. అయినా ఇదేం పంపకాలెయ్యడం? సగం ఇల్లు, సగం పొలం పంపొచ్చుగా! పుట్టి పెరిగిన ఇంటిమీద నాకు మాత్రం మమకారం ఉండదా?"

ముసలాయన పగలబడి నవ్వేడు. నవ్వి నవ్వి కళ్ళల్లో నీళ్లొచ్చాక ఆగేడు. అందరూ ఆయన వేపే చూస్తున్నారు.

"ఒరేయ్ బాబూ, ఈ ముసిలోడేంట్రా ఉన్నదున్నట్టు మాట్టాడుతున్నాడని అనుకుంటే అనుకోండి గానీ నేనొక్క మాటంటాను. మీకిద్దరికీ ఆ ఇంటిమీద అంత మమకారం ఎందుకుట్టిపడిపోతందో నేను చెప్పనా, ఆ ఇల్లు రెండు గదులదే గావచ్చు, ఆ ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ స్థలం అరెకరం ఉంది. ట్రంకు రోడ్డు పక్కనంతా షాపులు పెరిగిపోయి ఆ స్థలానికి విలువ విపరీతంగా లేచిపోయింది. అమ్ముకుంటే లక్షలొస్తాయి లేదా షాపులు కట్టుకుంటే పెట్టిన పెట్టుబడి ఎడ్వాన్సుల రూపంలో వచ్చెయ్యగా నెలనెలా చెట్టునుంచి రాలిపడినట్టు అద్దె రూపాయలొస్తాయి. అందుకే

రామ్మూర్తి చెప్పినట్టే పొలం ఒక వాటాకీ, ఇల్లు ఒక వాటాకీ ఏసి పద్ధతి ప్రకారం చిన్నోణ్ణి కోరుకోమనగానే ఇల్లే కావాలన్నాడు. రామ్మూర్తి మట్టుకు తమ్ముణ్ణెలాగైనా ఒప్పించి ఆ ఇల్లే లాక్కోవాలని చూస్తున్నాడు. తల్లి పోగానే పంపకాలంటూ సిద్ధపడడానికి ముందు మీకో తోబుట్టువు ఆడదయి ఉందనీ పెళ్లి చేసుకుని పరాయింటికెళ్లే వరకూ మీ ఇంటి చాకిరీ అంతా ఆయమ్మే చేసిందనీ, రోజంతా ఊరిమీదుండి పెరిగే మగోడికన్నా ఇల్లంటుకుని పెరిగిన ఆడపిల్లకే పుట్టింటి మీద మమకారం ఎక్కువగా ఉంటాదనీ మీకన్పించిందా అసలు? తల్లి పోయినప్పుడు మీదపడి ఏడ్చిందెవర్రా, నువ్వా మీయన్నా? ఇంకా ముక్కుపచ్చలారని మీ బిడ్డల్ని తాత ఆస్తికి వారసుల్ని చేసేస్తున్నారే, మీతండ్రి రక్తం పంచుకు పుట్టిన మీ తోబుట్టువు నలుగురు బిడ్డల్తో, భర్త లేక నానా అవస్థలూ పడుతూంటే, మీకేమైనా ఆ విషయం మనసులోకొచ్చిందా అసలు? అదేమంటే మా యక్క పెళ్లి నాటికి ఆడోళ్లకి ఆస్తిహక్కు లేదంటారు. హక్కుల మాట పక్కనెట్టి మనుషుల్లాగా ఆలోచించండ్రా, మీరింతంత గుంట పిల్లలప్పట్నుంచీ నాకు తెలుసు. చిన్నప్పుడు మీ కష్టాల్ని సుఖాల్ని పంచుకుంటూ మీ ఇంట మరో ప్రాణి పెరిగిందనే మాట నొకసారి మననం చేసుకోండ్రా..."- తను చెప్పాల్సిందింకేమీ లేనట్టు ముసలాయన కర్ర తాటించుకుంటూ లేచి నిలబడ్డాడు.

తొమ్మిదింటికల్లా అన్నం తినకపోతే ఆయన ముసలిప్రాణం రెపరెప లాడుతుంది. అనుకోకుండా అన్నదమ్ములిద్దరి చూపులూ కలుసుకున్నాయి.

*********

**ఆంధ్రజ్యోతి వీక్లీ (10/7/97)**

**(న్యూజెర్సీ పోటీలో మొదటి బహుమతి)**